# నమ్మకంలేని తేలుకాటు

వల్లూరి కృష్ణారావు

స్కెచ్

చిక్కటి రాత్రి. గోపాలం భూమిమీదకు వంగి పోతూ, గుడ్డిదీపందగ్గర నిద్రమైకంతో చదువు కుంటున్నాడు. ఇంతలో మాష్టారు కెవ్వున కేక వేశారు. గోపాలం అదిరిపడ్డాడు. "మాష్టారూ" అని బహుదీర్ఘంగా కేకవేశాడు.

"తేలురా!"

"కుట్టిందాండీ!"

"నీ మొహంరా!"అన్నారు మాష్టారు. గోపాలం చిన్నబుచ్చుకున్నాడు.

"కనకాన్ని పిల్చుకువస్తాను సార్!"

"ఎందుకు?"

"మంత్రం వేస్తాడు."

'ఓరే! నా ఎముకలు కొరక్క, నోరుమూసు కొని పడుండు." అలా పడుంటే గోపాలమే కాదు ఆ అబ్బాయి.

"డాక్టర్ని పిల్చేదా?"

"ఊఁ"అని మూలిగాడు.

గోపాలం చీకట్లో తుర్రుమన్నాడు. మాష్టారి మూలుగులు చాలాదూరం వినిపిస్తూనే ఉన్నాయి.

కాలింగ్ బెల్లు నొక్కాడు గోపాలం, డాక్టరు వచ్చాడు ఇవతలకు.

"తేలుకుట్టిందండీ!"

"నీకా?"

"కాదు. మాష్టారికి" నవ్వుతూ అన్నాడు గోపాలం.

"మాష్టారికి తేలుకుడితే నవ్వొస్తోందా నీకు?" గోపాలం మాట్లాడలేదు. "మంత్రం వేయించలేక పోయావా?" డాక్టరు తిరిగి అన్నాడు.

"మంత్రంలో మాష్టారికి నమ్మకం లేదు" గోపాలం జంకుతూ అన్నాడు.

"ఏదైనా మందు ఇస్తే..." అని ఆగాడు గోపాలం.

"మందులోనైనా నమ్మకముంటుందా ఆయనకు?" అంటూ లోపలికి వెళ్ళి క్షణంలో తిరిగివచ్చి "పద" అని గోపాలాన్ని అనుసరించాడు.

"ఈయనే మాష్టారు" అన్నాడు గోపాలం. మాష్టారు తన తొడను, రెండుచేతులతోనూ లేవనెత్తి పట్టుకొని తల గోడకాన్చి మొహం కప్పువైపుపెట్టి బాధగా మొహాన్ని వికృతంగాఉంచాడు.

"తెల్సు. కథలు రాస్తుంటారు." డాక్టరు మాష్టారు మొహంలోకి తొంగిచూశాడు. అంతవరకూ బాధతో సతమతమవుతున్న మాష్టారు చిరునవ్వు నవ్వారు.

"మీరు గట్టివారు" డాక్టరు మొహాన్ని కుదించి కళ్ళను మాష్టారు కళ్ళల్లోకి గురిపెట్టి అంటున్నాడు.

"మీరు రమ్మంటే ఎంత పనున్నా వచ్చాను. ఎంచేతనో తెల్సా?"

"నామీద మీకున్న అభిమానం." తెల్లటి పలువరస పైకి కనపడింది.

"కాదు." డాక్టరు తల గాలిలో ఆడించాడు.

"మరి?"మాష్టారు ఆశ్చర్యంగా నోరు తెరిచారు.

"భయం!" డాక్టరు జవాబు మాష్టార్ని మాయలోకి గెంటింది.

"భయమా?" వందరూపాయల నోటును రోడ్డుమీద చూసినా అంతగా ఆశ్చర్యపడడు.

"భయమే లేకపోతే మీ కథల్లో నేను కనపడతాను ఒక కఠినుడుగా! కదూ?"

"చంపారు" మాష్టారు పకపక నవ్వాడు. తేలు కుట్టి అఘోరిస్తున్న మాష్టారు పకపక నవ్వడం చూసి గోపాలం బొత్తాములులేని చొక్కాను దగ్గరకు లాగి గుప్పిట్లో పెట్టుకొని మునిగాళ్ళమీద కూర్చున్నాడు.

"మర్చిపోయాను క్షమించండి, క్షణాలో తగ్గిపోతుంది. కాసిన్ని వేణ్ణీళ్ళు పట్రా గోపాలం!" లోపలికి వెళ్ళాడు. డాక్టరు మళ్ళీ మొదలు పెట్టాడు.

"మీ కథలు నేను చాలా శ్రద్ధగా చదువుతాను. కారణ మేమిటని అడగకండి ఊరికినే."

మాష్టారు ఎంతో సంతృప్తిగా వింటున్నారు.

"మీ కథలు చాలా రియలిష్టిక్‌గాను, సైకలాజికల్ ట్రీట్‌మెంట్ * కలిగియున్నవిగాను ఉంటాయి. అందుకే నాకిష్టం." మాష్టారుకు ఏం మాట్లాడాలో తెలియకుండా ఉంది. ఏక ఎంతో ఇదైపోతున్నాడు.

"మీరు నాస్తికులా?" డాక్టరు కంటిగుడ్లను కొలుకుల దగ్గరకు తీసుకొచ్చి అన్నాడు.

"ఆ...ఏదో జ్యోతి..." మాష్టారు నసుగుతున్నారు.

"అవును." డాక్టరు మాష్టార్ని పూర్తిగా చెప్పనియ్యలేదు. ఇంకా అన్నాడు: "అలానే, నేనూ అనుకుంటాను. విన్నాను మీ థీరీ."

మాష్టారు బుఱ్ఱ ఆడిస్తున్నారు తమాషాగా.

"ఈ తేలు మంత్రాలూ...అవీ" డాక్టరు అన్నాడో లేదో మాష్టారు ఒక్కమాటు "అబ్బా!" అనుకొని "వట్టి బూటకాలు! ఏమంటారు?" అన్నారు.

"అవొచ్చేమో! ఇంజక్షను చేస్తాను తగ్గిపోతుంది. మామూలుగా నిద్రపడుతుంది. రేపు ఒకమాటు రండి." అని డాక్టరు ఇంజక్షన్ చేసి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు మాష్టారు డాక్టర్ని కలుసుకొన్నారు. డాక్టరు చాలా ఉత్సాహంగా డ్రాయరుమీదకు వంగి మాష్టారు కళ్ళను చూస్తూ "ఏం, రాత్రి నిద్రపట్టిందా?" అన్నారు.

"నేనెప్పుడూ అంత బాగా నిద్రపోలేదు" నవ్వుతూ అన్నాడు.

"వెరీగుడ్" తలపైనుంచి క్రిందికి ఒకమాటు కుదిపాడు కళ్ళుమూస్తూ.

"నేనందుకే మిమ్మల్ని పిలవమన్నాను. నాకు నచ్చవు మంత్రాలూ అవీను."

"నే వేసిందేమి?" డాక్టరు మాష్టారు మొహాన్ని చాలా ఇదిగా పరిశీలిస్తున్నాడు.

"మందు కదూ!" మాష్టారు సంకోచిస్తూ అన్నారు.

"కాదు" డాక్టరు మెల్లిగా అన్నాడు.

"మరి?' మాష్టారు ఆశ్చర్యపోయాడు మరీ ఇదిగా.

"చూడండీ, మీరు పిల్లల్ని మాయకథలు చెప్పి మంత్రబద్ధుల్ని చేస్తారు. ఆ సమయంలో కరిగించిన లక్కలా మీరు చెప్పినట్టు వింటారు పిల్లలు--దాన్నే మంత్రం అంటాను. ఏమంటారు?"

మాష్టారు వెర్రివాడిలా చూస్తున్నారు.

"ఏదో నోట్లో జపించి, మంత్రగాడు ఇతరుల దృష్టిని తన వైపు లాక్కుంటాడు. అదేమంత్రం. మీరు చదువుకున్నారు, కనక అందరూ వేసేమంత్రాలకి పడరు మీరు. ఇంకోరకం మంత్రగాడు కావాలి. నే వేసింది మందుకాదు మంత్రమే. నే చేసిందేమిటో తెలుసా—? మీ అభిరుచి తెలుసుకొని, దాన్నే కేంద్రంగా తీసుకున్నాను. మాటలతో మిమ్మల్ని మాయలోకి లాక్కుపోయాను. మంత్రంతోనే జోకొట్టి నిద్రపుచ్చాను మిమ్మల్ని. ఇంజక్షను ఊరికే మంత్రదండంలా ఉపయోగించానే కాని అది ఎలాటి ఉపయోగాన్నీ ఉద్దేశించి కాదు. మంత్రం అంటే దేవుని ప్రసాదం మాత్రమే కాదు అంటాను. ఏమంటారు?"

"అవునేమో!" అని మాష్టారు మూలిగి జేబులోంచి ఐదు రూపాయల నోటు తీసారు.

"వద్దు సర్. మరో మాటు."

"మళ్ళీ తేలు."

"కాదులెండి." డాక్టరు పకపక నవ్వుతూ అన్నాడు. ఆ నవ్వు సుడులలో మాష్టారు వీథి మెట్లు దిగుతున్నారు.

---

'అనగా అనగా' రోజుల్లో పేరుమోసిన ఒక గజదొంగ ఎలాగైతేనేం చివరకి పట్టుబడ్డాడు. వాడిని రాజభటులు రాజుగారి సమక్షాన నిలబెట్టారు. ఆ రాజుగారు ఒక విచిత్రవ్యక్తి. దొంగతో అన్నాడు: "నువ్వు ఒక్క వాక్యమే మాటాడాలి. అది నిజమైతే నిన్ను ఉరితీయిస్తాను; అబద్ధమైతే పాతిపెట్టిస్తాను. చెప్పు, నువ్వెలా చావబోతున్నావ్?" క్షణం ఆలోచించి దొంగ అన్నాడు: "నన్ను మీరు పాతిపెట్టబోతున్నారు."